

యార్డుకు 1,15,799 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,11,337 బస్తాలు అమ్మకాలు జరిగాయి. ఇంకా 87,374 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు కార్యదర్శి తెలిపారు.



ఫార్మా పరిశ్రమల్లో మాక్ డ్రిల్

దాచేపల్లి: నడికుడి పారిశ్రామిక వాడలోని ఫార్మా పరిశ్రమల్లో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆపద్ మిత్ర బృందం పలు పరిశ్రమల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించింది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

అమరావతిలో 200 కుటుంబాలకు పెన్షన్

భూమిలేని వలంటీర్ల కుటుంబాలకు మంజూరు

సాక్షి, అమరావతి: అమరావతిలో భూమి లేని పేద కుటుంబాలకు ప్రతినెలా అందిస్తున్న పెన్షన్ పరిధిలోకి ప్రభుత్వం గ్రామ వలంటీర్ల కుంటుబాలను కూడా తీసుకువచ్చింది. వీరికి ప్రతినెలా వీరికి రూ.2500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పెన్షన్ అందించాలని గురువారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఆదేశించారు. అమరావతిలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు చెందిన సుమారు 200 మంది గ్రామ వలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. ఇటీవల శ్రీలక్ష్మి అమరావతి గ్రామాలలో పర్యటించినప్పుడు భూమి లేని కుటుంబాలకు చెందిన వలంటీర్లు విషయాన్ని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించగా, అమరావతిలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు అందిస్తున్నట్టుగానే, భూమిలేని వలంటీర్ల కుటుంబాలకు కూడా నెలకు రూ.2500 పెన్షన్ అందించాలని ఆదేశించారు. సుమారు 200 కుంబాలకు మార్చి ఒకటో తేదీన ఆ మొత్తం అందజేస్తామని సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

అమరేశ్వరుడికి రూ.41.03 లక్షల ఆదాయం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసిఉన్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపును దేవదాయశాఖ ఉత్సవ అధికారి సమక్షంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రికి మొత్తం రూ.41,03,542 ఆదాయం లభించిందని వివరించారు. హుండీల ద్వారా రూ.26,48,425 వచ్చినట్లు తెలిపారు. పూజా టికెట్లు, శివరాత్రి ప్రత్యేక అభిషేక పథకం, లడ్డూ ప్రసాదం తదితరాల ద్వారా రూ.14,55,117 అందినట్లు చెప్పారు. గత సంవత్సరం శివరాత్రికి రూ.32.54 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో చీరాలకు చెందిన భ్రమరాంబ సేవా సమితి, గుంటూరుకు చెందిన దుర్గామల్లేశ్వర సేవా సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత రవాణా, వసతి సదుపాయాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం రవాణా, వసతి సదుపాయాలను కల్పిస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. జిల్లా నుంచి పాల్గొననున్న విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లను తీసుకెళ్లేందుకు ఈనెల 27న ఉదయం 4 గంటల నుంచి విజయవాడ ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో రవాణా సౌకర్యం కల్పించే ఏర్పాట్లు చేశారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకుని రవాణా, వసతి సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 9866528299 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సూర్యకిరణాల వెలుగులో జలపాలేశ్వరుడు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని 16వ శతాబ్దం నాటి ఆలయంలోని జలపాలేశ్వరస్వామిపై సూర్యకిరణాలు పడుతుండటం విశేషం. 1675లో చోళరాజులు తమ రాజ్యంలోని ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకువచ్చి తాగునీటి కోసం ఓ బావిని తవ్వించారు. బావిలో నీరు పడటంతో ఇక్కడ జలపాలేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కాగా ప్రతి ఏటా శివరాత్రి మరుసటి రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు గర్భగుడిలో ఉన్న స్వామివారిపై సూర్య కిరణాలు పడి కొద్దిసేపు ఉంటాయని ఆలయ అర్చకులు ఉమాపతిశాస్త్రి తెలిపారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుంటున్నారు.

అసత్య కథనాలపై ఆగ్రహ జ్వాల

ఈనాడు క్షమాపణలు చెప్పాలి

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- ఈనాడు తప్పుడు రాతలపై గుంటూరు ఈనాడు కార్యాలయం వద్ద నిరసన
- ఈనాడు దినపత్రికలను దహనం చేసిన నేతలు



గుటూరులోని ఈనాడు కార్యాలయం వద్ద ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా, ఎమ్మెల్యే మద్దాళి, మేయర్ కావటి, మిర్చి యార్డు చైర్మన్ ఏసురత్నం, పానుగంటి

నెహ్రూనగర్(గుంటూరు): ఈనాడు దినపత్రిక దిగజారుడు వార్తలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ధ్వజమెత్తాయి. పత్రికా విలువలకు ఏనాడో తిలోదకాలు వదిలి విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈనాడు యజమాని రామోజీరావుపై కన్నెర్ర చేశారు. ఆగ్రహంతో అరండల్‌పేటలోని ఈనాడు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. తప్పుడు రాతలకు తెలుగు పాఠకులకు బహిరంగ ప్రకటన ద్వారా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. తెలుగుదేశం నేత పట్టాభికి గాయాలంటూ రెండేళ్ల క్రితం నాటి పాత ఫొటోలతో పాఠకులను తప్పుదోవ పట్టించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు, పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ప్రయత్నించిన ఈనాడు దినపత్రిక వ్యవహారశైలికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో గురువారం గుంటూరులో ఆందోళన జరిగింది.

పత్రికా విలువలను తుంగలో తొక్కిన ఈనాడు..

ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ పత్రికా విలువలను ఈనాడు పత్రిక తుంగలో తొక్కిందని మండిపడ్డారు. 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను వైఎస్సార్ సీపీ తరఫున 11 స్థానాల్లో బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తూ సీఎం జగన్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుంటే దానిని పక్కదోవ పట్టించేందుకే చంద్రబాబు రామోజీతో కలిసి ఈ కుట్ర పన్నారని ఆరోపించారు. సీఎం జగన్ నేతృత్వంలో జరుగుతున్న సామాజిక న్యాయాన్ని మరుగున పరిచే డ్రామాగా ఈనాడు కథనాన్ని పేర్కొన్నారు. అబద్ధాలు ప్రచురించడం ద్వారా క్రెడిబిలిటీ కోల్పోయిన ఈనాడు పత్రిక బహిరంగంగా తన పాఠకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వికృత ఆలోచనలతో రామోజీ..

గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మీడియా ద్వారా రిమోట్‌తో వ్యవస్థలను మేనేజ్ చేయవచ్చనే వికృత ఆలోచనలతో రామోజీరావు తన ఈనాడు పత్రికను నడుపుతున్నట్లు నిందించారు. అందుకే చంద్రబాబు కుట్రలకు వంత పాడుతూ ఎల్లో మీడియా హెడ్‌గా మారారని మండిపడ్డారు. గడచిన 44 మాసాలుగా సీఎం జగన్ అనేక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తుంటే దాన్ని కనబడకుండా చేయాలనే కుట్రతోనే ఎప్పటికప్పుడు ఇలా విషం చిమ్ముతూనే ఉన్నారని విమర్శించారు. దీన్ని విజ్ఞులైన పాఠకులు గమనిస్తూనే ఉన్నారని గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

ఈనాడుకు అభివృద్ధి కనిపించదు..

ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, ఈనాడు పత్రికకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించదని విమర్శించారు. ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ఈనాడు దినపత్రిక ఇప్పటికైనా చంద్రబాబు ట్రాప్ నుంచి బయటకు రావాలని హితవుపలికారు. మిర్చియార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఈనాడు యజమాని రామోజీరావు చంద్రబాబును ఎలాగైనా అందలమెక్కించాలనే తొందరలో అనేక తప్పుడు రాతలు రాస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి వార్తలు మళ్లీమళ్లీ ప్రచురిస్తే పాఠకుల విశ్వాసం కోల్పోయి ఈనాడు మూతపడటం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచే మీడియా రంగం ముసుగులో పత్రికా విలువలను స్వార్థ రాజకీయ శక్తులకు తాకట్టు పెట్టిన ఈనాడు దినపత్రిక టీడీపీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు. ఈనాడు వ్యవహారశైలి ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయనిమచ్చని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గులాం రసూల్, ఝాన్సీ, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, వలివీరారెడ్డి, సాదు రాజేష్, గేదెల రమేష్, గీతా మందిరం చైర్మన్‌ వెలుగూరి రత్నప్రసాద్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, ఆలా సాంబశివరావు, టీఎల్‌వీ వీరాంజనేయులు, మాదాసు కిరణ్, సైదా, ఖాజా మొహిద్దీన్, ఆసం సంజీవరెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు తప్పుడు రాతలు మానుకోవాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి



ఈనాడు దినపత్రికను తగలబెడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ఈనాడు తప్పుడు రాతలు ప్రచురించడం మానుకోవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గన్నవరంలో జరిగిన సంఘటనపై అబద్ధపు రాతలు రాసిన ఈనాడు పత్రిక ప్రతులను స్థానిక మరుప్రోలువారిపాలెంలో తగలబెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఈనాడు పత్రిక వాస్తవాలకు దూరంగా, ప్రజలను పక్కదారి పట్టించేలా వార్తలు రాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చేజర్ల నారాయణరెడ్డి, నక్కా వీరారెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, కొండలరెడ్డి, అంకిరెడ్డి, రాజు, పిన్నిబోయిన ప్రసాద్, బుల్లిరెడ్డి, మేడిపోయిన బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలే లక్ష్యంగా ఈనాడు రాతలు

ఈనాడు ప్రతులను దహనం చేసిన మంత్రి మేరుగ నాగార్జున

వలివేరు(వేమూరు): ప్రజల మధ్య విద్వేషాలే లక్ష్యంగా ఎల్లో మీడియా పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనాడు పత్రికా విలువలకు పాతరేసిందన్నారు. గన్నవరం ఘటనలో పట్టాభిని పోలీసులు కొట్టినట్లుగా నమ్మించడానికి ప్రయత్నించి విఫలమైందని తెలిపారు. అబద్ధాలు ఎక్కువ కాలం చెల్లవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, కారుమూరి వెంకటరెడ్డి, ఉయ్యూరు అప్పిరెడ్డి, గాదె శివరామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వలివేరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, నాయకులు

ప్రయోగాలతో సృజనకు పదును

- సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం
- ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు



విద్యార్థులు తయారు చేసిన ప్రయోగ నమూనాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

బాపట్ల అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ చదువుకున్న అంశాలు ప్రయోగాల ద్వారా నిజ జీవితంలో ఎలా మేలు చేస్తాయో విద్యార్థులు తెలుసుకునేలా చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రయోగాలు చేయడం ఎంతో అవసరమన్నారు. ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థుల మేధోశక్తి, విజ్ఞానం మరింతగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. జిల్లాలో తొలిసారిగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలన్నారు. ప్రదర్శనలు చూడటం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులు విద్యార్థులను ఎంతగానో ఆకర్షించాయి. బాపట్లలోని వివిధ పాఠశాలల విద్యార్థులంతా ప్రదర్శనలోని ప్రాజెక్టులను తిలకించేలా అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు తయారు చేసిన 135 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ప్రాజెక్టుల ద్వారా కలిగే ప్రయోజనాలపై విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేస్తూనే వారిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పీవీ రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్, హెల్త్ అండ్ క్లీన్లీనెస్, సాఫ్ట్ వేర్ యాప్స్, మ్యాథమెటిక్స్ మోడలింగ్ అంశాల ఆధారంగా విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను మండల స్థాయికి, మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనలో అవకాశం కల్పించామన్నారు. పది మంది నిష్ణాతులైన శాస్త్రవేత్తలను న్యాయనిర్ణేతలుగా నియమించామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి పంపుతామని చెప్పారు. వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలను వెలికితీయడానికి నిష్ణాతులైన వారితో మూడంచెల ఎంపిక విధానాన్ని అమలు చేశామన్నారు. కౌశల్ క్విజ్‌లో జిల్లా వ్యాప్తంగా 200 జట్లతో పోటీపడి ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపట్ల ఉల్లిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 36 జట్లను ఓడించి ప్రథమ స్థానంలో నిలిచిన బాపట్ల జిల్లాకు చెందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓ కిరణ్ కుమార్, ఎంఈఓ నాగేశ్వరరావు, బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గస్తీ వ్యవస్థను పటిష్టపరచాలి

నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రి సమయంలో గస్తీ వ్యవస్థను పటిష్టపరచాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ దొంగతనాలు కట్టడి చెయ్యాలంటే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బీట్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. బీట్ తిరిగే ప్రదేశాలు, సమయాన్ని ఎప్పటికప్పుడు మారుస్తు ఉండాలన్నారు. బీట్ సిబ్బంది, తనిఖీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ కాల్స్ 112, 100 వంటి వాటిపై తక్షణమే స్పందించాలన్నారు. వెనువెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. గంజాయి కట్టడి చేయడానికి పోలీస్ అధికారులు నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. గతంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడినవారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? వారి జీవన విధానం ఎలా ఉంది? ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నారా? వారు ఎటువంటి వ్యక్తులను కలుస్తున్నారు? అనే విషయాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. గంజాయి, నాటుసారా అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారుల పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులలో విచారణ వేగవంతం చెయ్యాలన్నారు. 60 రోజులలోపు విచారణ పూర్తి చేసి సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన కూడళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పి పి.మహేష్, డీసీఆర్‌బి డీఎస్పీ జి.లక్ష్మయ్య, బాపట్ల, రేపల్లె డీఎస్పీలు ఎ.శ్రీనివాస రావు, టి.మురళీకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.వి.రమణ, ఎస్‌బి సీఐ ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- వైఎస్సార్ సీపీ పాలనలో 70 శాతం పదవులు అణగారిన వర్గాలకే
- చంద్రబాబు దృష్టిలో బీసీలంటే ఓటు బ్యాంకు మాత్రమే
- పట్టాభి వ్యవహారంతో 'ఈనాడు' కుట్రలు బట్టబయలు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, మహిళా నాయకులు

ఒంగోలు: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన పట్టాభి కథనానికి సంబంధించి సునీత మాట్లాడుతూ ఏడాది క్రితం నాటి ఫొటో ప్రచురించి పాఠకులను తప్పుదారి పట్టించారంటూ ధ్వజమెత్తారు. ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే ఏలూరులో జరిగిన సభలో బీసీలంటే బ్యాక్‌బోన్ అంటూ బీసీలలో ఎనలేని ఆత్మస్థైర్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నింపారన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి అయిన వెంటనే పేదలు, అణగారిన వర్గాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో బీసీలకు 55 శాతం పదవులు కేటాయిస్తూ బీసీలను అక్కున చేర్చుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో 136 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవులు కేటాయించడంతో పాటు మంత్రివర్గంలో 11 మంది బీసీలకు, ఐదుగురు ఎస్సీలకు, ఒక మైనార్టీకి స్థానం కల్పించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. లోక్‌సభలో 8 మంది బీసీలకు, రాజ్యసభలో 50 శాతం బీసీలకు స్థానం కల్పించారని, ఇది దేశ చరిత్రలోనే తొలిసారిగా జరిగిందని వివరించారు. తాజాగా 18 ఎమ్మెల్సీ ఖాళీలు ఉంటే.. వాటిలో 11 బీసీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు కేటాయించి బీసీలంటే రాష్ట్రానికి బ్యాక్‌బోన్ అని మరోసారి సీఎం చాటిచెప్పారన్నారు. కానీ, చంద్రబాబు హయాంలో సమస్యలను ప్రస్తావించిన నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులను ఎలా హెచ్చరించారో.. దళితుల గురించి ఎంత నీచంగా మాట్లాడారో.. మహిళల పట్ల చులకనగా ఏ విధంగా వ్యవహరించారో ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు హయాంలో 45 ఎమ్మెల్సీ స్థానాలుంటే.. వాటిలో 30 ఓసీలకు కేటాయించి 15 మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారన్నారు. ఇదేనా బీసీలపై చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి అంటూ ప్రశ్నించారు.

చంద్రబాబు కోసం తప్పుడు రాతలు..

అధికారం కోసం చంద్రబాబు అర్రులు చాస్తున్నారని, ఆయనకు ఎలాగైనా సీఎం పీఠం దక్కేలా చేయాలని పచ్చమీడియా నిత్యం పాకులాడుతోందని, అందులో భాగంగానే ఏడాది క్రితం నాటి పట్టాభి డ్రామా ఫొటోను తాజాగా జరిగినట్లు పేర్కొంటూ ప్రచురించి నాలుక కరుచుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఈనాడు పతనం ప్రారంభమైందని, ఈ నేపథ్యంలో పాఠకుల విశ్వాసాన్ని కూడా కోల్పోయిందని విమర్శించారు. చేనేతల ఆడపడుచుగా తనకు మరోమారు ఎమ్మెల్సీ పదవి కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ప్రతి మహిళ, ప్రతి పేద కుటుంబం వైఎస్ జగన్‌కు అండగా ఉండేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ముందుగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావులు పోతుల సునీతకు పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, బడుగు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులదే కీలక బాధ్యత

సదస్సులో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చీరాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులదే కీలక బాధ్యతని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పీఓల విధులు, పోలింగ్ సామగ్రి, ఎన్నికల ముందు నిర్వహించాల్సిన ప్రక్రియ, బ్యాలెట్ బాక్సులు సీజ్ చేసే విధానంపై అధికారులు తెలుసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాల వినియోగం, డిక్లరేషన్ ప్రక్రియ చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల్లో పీఓలు బాధ్యతగా వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. బాపట్ల జిల్లా పరిధిలో 13 మండలాల్లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు జరుగుతాయన్నారు. బ్యాలెట్ బాక్సుల వినియోగం, ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల వినియోగం, డిక్లరేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. ఎన్నికల ముందు ఎన్నికల సామగ్రి తరలింపు, ఎన్నికల తదుపరి బ్యాలెట్ బాక్సులు అత్యం భద్రత మధ్య తరలించాల్సి ఉందని సూచించారు. కార్యక్రమంలో చీరాల ఆర్‌డీఓ పి.సరోజిని, బాపట్ల ఆర్‌డీఓ జి.రవిందర్, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

బాధితులకు 13 మొబైల్ ఫోన్లు అందజేత

- ఫోన్ పోగొట్టుకుంటే 8978777833 వాట్సాప్ నంబర్‌కు హాయ్ మెసేజ్ చాలు
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: ఫోన్ పోయిందని చింతించాల్సిన అవసరం లేదని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్న 13 మంది బాధితులకు గురువారం ఫోన్లు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందజేస్తారన్నారు. జిల్లా ఏర్పాటు జరిగిన తరువాత అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అనేక మంది బాధితులు వారి మొబైల్‌ఫోన్‌లు పోయాయని ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిచేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించామన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకపోయినా వారు ఉన్న ప్రాంతం నుంచే 8978777833 కు వాట్సప్‌లో హాయ్ అని మేసేజ్ చేస్తే వెంటనే ఐటీకోర్ సిబ్బంది రంగంలోకి దిగి ఫోన్‌ను ఇట్టేపట్టేస్తారన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కోసం ప్రత్యేక సర్వీస్ పిటీషన్ లు అందుబాటులో ఉంచామన్నారు. బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పి.కృష్ణయ్య 13 మొబైల్ ఫోన్‌లను ట్రేస్ చేశారన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల పట్టణ సీఐ పి.కృష్ణయ్య, ఎస్ఐ రఫీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 250 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 258 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 10 క్యూసెక్కులు విడుదల చేశారు.

తప్పుడు కథనాలపై ఆగ్రహం

ఈనాడు దినపత్రికను దహనం చేసిన వైఎస్సార్ సీపీ నేతలు



పర్చూరులో ఈనాడు పత్రికను దహనం చేస్తున్న దృశ్యం



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పర్చూరు: తప్పుడు కథనాలు ప్రచురించిన ఈనాడు దినపత్రికను వైఎస్సార్ సీపీ నాయకులు తగులబెట్టారు. ఈ సంఘటన పర్చూరు బొమ్మల సెంటర్‌లో గురువారం జరిగింది. ఖబడ్దార్ రామోజీరావు అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నూతలపాటి బలరాం మాట్లాడుతూ టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరాంపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ ఈనాడు అసత్య కథనాలు ప్రచురించిందని తెలిపారు. ఎమ్మెల్సీ పదవుల పంపిణీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయం పాటించారని, దాన్ని తట్టుకోలేక 2021 నాటి క్లిప్పింగులను ప్రచురించి పట్టాభిని కొట్టారంటూ తప్పుడు వార్తలు రాశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కఠారి అప్పారావు, పర్చూరు ఉపసర్పంచ్ గాదె సురేష్, దేవరపల్లి ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగా అనీల్‌కుమార్, ఆకుల హేమంత్, అడపా సుధాకరరెడ్డి, ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు, రామకృష్ణ, నాయకులు గర్నెపూడి రవిచందు, కాకోలు వెంకటేశ్వర్లు, గర్నెపూడి రవితేజ, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకతోటి సామ్యేల్, మార్టూరు మండల సోషల్ మీడియా కో కన్వీనరు జెట్టి వినోద్‌కుమార్, నూతలపాడు సర్పంచ్ చిన్నయ్య, కొత్తపాలెం సర్పంచ్ భూషిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ కాలేషా, కోడూరి నాగరాజు, మార్నెళ్ల శ్రీధర్, పిచ్చిరెడ్డి, కారంచేడు మండల కోఆప్షన్ సభ్యులు నూర్ అహ్మద్, పర్చూరు సొసైటీ అధ్యక్షుడు కుక్కపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అబద్ధాల పత్రిక ఈనాడు ప్రతులు దగ్ధం

చీరాల: అబద్ధాల పత్రిక ఈనాడు ప్రతులను వైఎస్సార్ సీపీ నాయకులు దహనం చేశారు. గురువారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఈనాడు పత్రికలో అబద్ధాలను ప్రచురించడంతో పాటు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీపై అబద్ధపు ప్రచారాన్ని నిరసిస్తూ ఈనాడు ప్రతులను దహనం చేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ నాయకుడు పట్టాభి ముఖ్యమంత్రిని, మంత్రులను గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీని తీవ్రంగా దుర్భాషలాడడంతో పాటు ఓ దళిత సీఐపై దాడి చేస్తే చివరకు ఈనాడు రామోజీరావు రెండేళ్ల కిందట జరిగిన సంఘటనలకు సంబంధించిన ఫొటోలను ముద్రించి పట్టాభిపై లాఠీ ఉపయోగించారని అబద్ధాలు రాయడం ఇదేం జర్నలిజమని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా రామోజీరావు చంద్రబాబు కుమ్మక్కు అయి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీపై నీచపు రాతలు రాస్తున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈనాడు పత్రికను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు, గవిని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, పార్టీ నాయకులు వాసిమళ్ల వాసు, మల్లి రామకృష్ణ, మల్లెల రాజశేఖర్, పులి వెంకటేశ్వర్లు, కె.వి జయప్రకాష్, ఎస్.అనీల్, చావల వాసు, మస్తాన్, పాపాబత్తుని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలతో దుష్ప్రచారం

- సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గరటయ్య
- ఈనాడు దినపత్రికల దహనం



ఈనాడు దినపత్రికను దహనం చేస్తున్న గరటయ్య, నాయకులు

అద్దంకి రూరల్: ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిస్తూ ఈనాడు దినపత్రిక రాస్తున్న తప్పుడు రాతలను మానుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య హితవు పలికారు. గురువారం టీడీపీ నేత పట్టాభి విషయంలో అవాస్తవాలను ప్రచురించిన ఈనాడు కథనాన్ని ఖండిస్తూ గరటయ్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనాడు దినపత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా ఉండాల్సిన జర్నలిజాన్ని ఈనాడు పత్రికాధినేత రామోజీ చంద్రబాబుకు తొత్తుగా మారి భ్రష్టు పట్టిస్తున్నాడన్నారు. పట్టాభికి ఎప్పుడో జరిగిన దెబ్బలను చూపించే ఫొటోలు పత్రికల్లో ప్రచురించి వైఎస్సార్ సీపీ నాయకులపై దుష్ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు రాతలు రాయడం చేయటం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, మున్సిపల్ చైర్మన్ ఎల్.ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ పద్మేష్, నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి, సందరెడ్డి రమేష్, పూనూరి నరేంద్ర, కొల్లా భువనేశ్వరి, ఎస్.కొండలు, జి.మాధవరావు, సాధినేని మస్తాన్‌రావు, వార్డు కౌన్సిలర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకతవకలపై లోకాయుక్త విచారణ



పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న ఈఈ హరే రామకృష్ణ

వేటపాలెం: మండల పరిధిలోని అక్కాయిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో లోకాయుక్త ఆదేశాల మేరకు రోడ్లు, భవనాల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి ఒంగోలుకు చెందిన ఈఈ జే హరేరామకృష్ణ గురువారం విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ వేటపాలెం మండలం రావూరిపేటకు చెందిన కల్లూరి నాగరాజు రామాపురం గ్రామంలో సిమెంట్ రోడ్డు వేయకుండా వేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేసి నగదు డ్రా చేసినట్లు, వేటపాలెం గ్రామ సచివాలయ భవనం పనులు జరపకుండా జరిపినట్లు రికార్డులు రాసి నగదు డ్రా చేశారని తెలిపారు. వేటపాలెం గ్రామంలో సీసీ ఓపెన్ డ్రైనేజీ పనులు ప్రారంభించకుండా చేసినట్లు నిధులు డ్రా చేశారని లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాది నాగరాజును, సంబంధిత పర్యవేక్షణ ఇంజినీర్‌ని విచారణ చేశామని చెప్పారు. నివేదికను లోకాయుక్త అధికారులకు పంపించనున్నట్లు వారు తెలిపారు.

నాణ్యమైన ఆహార వస్తువులు అందివ్వండి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన పోషక వస్తువులు సక్రమంగా సరఫరా జరిగేలా సంబంధిత ఏజెన్సీలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ పోషణ కిట్‌లు, పోర్టిఫైడ్ రైస్, నూనె, కందిపప్పు, కోడిగుడ్లు, నిర్దేశించిన పరిమాణంలో నాణ్యంగా ఉండాలని, వీటిని సీడీపీవోలు పరిశీలించాలని తెలిపారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెడుతుందని, గర్భిణీలు, చిన్నారులు, ముఖ్యంగా రక్తహీనత ఉన్నవారికి సరైన పోషక విలువలు ఉన్న ఆహారం తప్పక అందించాలన్నారు. పేదలు ఎక్కువగా ఆధారపడే ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ మనోరంజని, జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీ, డీఎస్ఓ పద్మశ్రీ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించకండి!

- జెడ్పీ ఆస్తులను పరిరక్షించాలి
- ఆదాయ పెంపుదలకు సమష్టిగా కృషి చేయండి
- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో మూడు జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మండలాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, ఇకపై ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత అధికారుల మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఆస్తులను పరిరక్షించడంలో ఎంపీడీవోలు కీలక పాత్ర పోషించాలని, స్థానిక జెడ్పీటీసీలతో కలిసి తరచుగా ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కొంత కాలంగా జెడ్పీకి, ఎంపీడీవోలకు మధ్య దూరం పెరిగిందని, ఇకపై అటువంటి పరిస్థితులు లేకుండా నిరంతరం సమీక్ష సమావేశాలను నిర్వహిస్తామన్నారు. సీఈవో జె.మోహన్‌రావు మాట్లాడుతూ జెడ్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, మండల పరిధిలోని అన్ని రిపోర్టులు స్వీకరణతో పాటు పరిపాలనా పరంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు ఉపయోగపడుతుందన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జెడ్పీ ఆస్తులను పరిరక్షించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చాంబర్లో జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు సమావేశాన్ని నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అచ్చంపేట మండలంలోని రేవులు అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆక్రమణలకు గురైన జెడ్పీ భూములను గుర్తించి తక్షణమే వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములుగా నమోదు అయిన జెడ్పీ ఆస్తులను తిరిగి జెడ్పీ ఆస్తులుగా వర్గీకరణ చేయాలని పేర్కొన్నారు. జెడ్పీ భూముల్లో హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయ వనరులు పెంపొందించాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న జెడ్పీ గెస్ట్‌హౌస్‌లను బాగుచేయించి వినియోగంలోకి తేవడం ద్వారా ఆదాయ వనరులు పెంచాలని తెలిపారు. మండలస్థాయిలో ఏర్పాటు చేసిన ఆస్తుల పరిరక్షణ కమిటీ ఎప్పటికప్పుడు జెడ్పీ ఆస్తులను పర్యవేక్షిస్తూ అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఈవో జె.మోహనరావు, గుంటూరు, తెనాలి, గురజాల ఆర్డీవోలు, పీఆర్ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగుల కోసం కారు బహూకరణ



ఎలక్ట్రికల్ కారును ఆసుపత్రికి అధికారులకు అందజేస్తున్న డాక్టర్ జ్యోతి

గుంటూరు మెడికల్ : క్యాన్సర్ రోగుల కోసం జీజీహెచ్‌కి ఓ దాత కారునూ బహూకరించారు. క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉండి చికిత్స అవసరమై ఆసుపత్రికి రాలేని పరిస్థితులు ఉన్నవారి కోసం ఇంటి వద్దకే కారు పంపించి ఉచితంగా వారిని ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించి తిరిగి ఇంటి దగ్గర వదిలి పెడతారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఈ అవకాశం అందుబాటులోకి వచ్చింది. గుంటూరు వైద్య కళాశాల బయో కెమిస్ట్రీ విశ్రాంత ఆచార్యులు, దివంగత మట్టా జోజిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె డాక్టర్ జ్యోతి కుటుంబ సభ్యులు గురువారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ కు టాటా ఎలక్ట్రికల్ కారును బహూకరించారు. చికిత్స కోసం ప్రతిసారి ఆసుపత్రికి రాలేని క్యాన్సర్ రోగులకు వారి ఇంటికే నర్సింగ్ సిబ్బంది, సోషల్ వర్కర్ వెళ్లి వైద్య సేవలు అందించడానికి ఉద్దేశించి ఈ కారును బహూకరించినట్లు దాత డాక్టర్ జ్యోతి వెల్లడించారు. తొలి సారిగా నాట్కో క్యాన్సర్ సెంటర్ ద్వారా గుంటూరు నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో క్యాన్సర్ ఉన్న రోగులకు, ఇంటి వద్దనే వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్ తెలిపారు. ఆసుపత్రికి రాలేని రోగులకు సేవలు అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అన్నారు. వాహన సేవలు అవసరమైన క్యాన్సర్ రోగులు హెల్ప్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, పీజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రతీరంలో యువకుడి మృతదేహం



వేటపాలెం: వేటపాలెం మండలం రామాపురం–చీరాల ఓడరేవు మధ్యలో సముద్రం ఒడ్డున గురువారం ఓ యువకుడి మృతదేహం వెలుగుచూసింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కన పురుగుమందు సీసా పడి ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు చీరాల ఓడరేవుకు చెందిన ఏరిపల్లి ఆనంద్ (25)గా గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించిన స్థానిక ఎస్సై జనార్దన్.. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బీసీలపై మమకారం మరోసారి రుజువైంది

–ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వంటి వెనుకబడిన వర్గాల వారికి రాజకీయ సామాజిక న్యాయం కల్పించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ శాసనమండలిలో 18 స్థానాలు ఉంటే వాటిలో 11స్థానాలు బీసీ సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యత కల్పించటం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలపై ఉన్న మమకారం మరోసారి రుజువు అయిందన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని దేశంలో పలువురు మేధావులు సైతం అభినందించారని అన్నారు. రాష్ట్రంలో ఇంత గొప్పగా పారదర్శకంగా పరిపాలన జరుగుతుంటే చూసి జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు చంద్రబాబు డైరెక్షన్‌లో రాష్ట్రంలో ఏదో అలజడి సృష్టించాలని, గన్నవరంలో పట్టాభి అనే టీడీపీ నాయకుడు అక్కడ ఉన్న నాయకత్వాన్ని రెచ్చగొడుతు గొడవ సృష్టిస్తే చట్టం తన పని తాను చేసుకుంటు పోయిందన్నారు. అటువంటి సంఘటనను టీడీపీ పచ్చ మీడియా మాత్రం ఉన్నదిలేనట్టు లేనిది ఉన్నట్టు కల్పించి పాత ఫోటోలు, క్లిప్పింగ్స్‌ను ముద్రించి వక్ర రాతలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారని టీడీపీ నాయకులు ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు గమనిస్తున్నారని, మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా చూసుకోవటానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని మోపిదేవి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జెడ్పీటీసీ మరివాడ పావని, మండల పార్టీ కన్వీనర్ షైనం ఏడుకొండలరెడ్డి, బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రేపల్లెరూరల్ వైకల్యమనేది శరీరానికేగాని మనస్సుకుకాదని, వైకల్యాన్ని జయించి ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భవిత స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ కుంభ నాగేంద్రమ్మ అన్నారు. నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఉచిత సహాయ ఉపకరణాలకై సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ జిల్లా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని భవిత స్కూలులో గురువారం నిర్వహించిన వైద్య నిర్ధారణ శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైకల్యం మరచి తమ మానసిక శక్తితో అనేక మంది కీర్తి శిఖరాలను అధిరోహించిన వారు ఉన్నారన్నారు. దివ్యాంగులు నిత్యం పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని ముఖ్యంగా చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవటంతో శారీరకంగా బలంగా ఉంటారని చెప్పారు. ప్రభుత్వం ఎస్కార్ట్, రీడర్, హోమ్‌బేస్డ్, ట్రాన్స్‌పోర్ట్ అలెవెన్స్‌లతోపాటు బాలికలకు ప్రత్యేక స్టైఫండ్‌ను అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకే కాకుండా తమ స్పెషల్ ఎడ్యుకేటర్‌లు వారంలో ఒక రోజు ఇంటి వద్దనే ఉండే దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి వారికై కొంత సమయం కేటాయించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఈ చిన్నారులకు జిల్లా వ్యాప్తంగా వైద్యశిబిరాలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాల వివరాలను ప్రభుత్వానికి అందించటం జరుగుతుందన్నారు. శిబిరానికి హాజరైన 100 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు వైద్యులు నాగేంద్రం, లాస్య, శరత్‌లు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంఈవో నవీన్‌కుమార్, స్పెషల్ ఎడ్యుకేటర్‌లు ఎస్.అనురాధ, రమాదేవి, సురేష్‌బాబు, మోహన్, నరేష్, రజిని, మహాలక్ష్మి ఉన్నారు.